క్లుప్తంగా

యువకుడి అదృశ్యం


సురేంద్ర (ఫైల్)

ఉండవెల్లి: యువకుడు అదృశ్యమైన సంఘటన ఆదివారం మండలంలోని పుల్లూరులో చోటుచేసుకుంది. ఎస్ఐ శ్రీనివాసులు కథనం మేరకు.. పుల్లూర్‌లో కుమ్మరి పద్మ, నాగేంద్రం దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉండేవారు. పెద్ద కుమారుడు చిన్నతనంలో మృతి చెందాడు. కూతురుకు పెళ్లిచేసి పంపించారు. చిన్నకు మారుడు సురేంద్ర(27) ఇంటర్మీడియట్ వరకు చదువుకున్నాడు. ఈ నెల 20న ఉదయం తల్లి పద్మ కూలీ పనికి వెళ్లింది. తండ్రి గేదెలు కాయడానికి వెళ్లాడు. అదేరోజు మధ్యాహ్నం 1.30 గంటలకు తల్లి ఇంటికి వచ్చి చూడగా సురేంద్ర కనిపించలేదు. చుట్టుపక్కల ఆరా తీశారు. బంధువులకు ఫోన్లు చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఆదివారం తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

అయిజ: మండల కేంద్రంలోని కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో నిబంధనలకు విరుద్ధంగా ఆదివారం క్లాసులు నిర్వహించడంతో ఇన్‌చార్జి ఎంఈఓ నరసింహ ఆయా పాఠశాలల యజమానులకు నోటీసులు జారీ చేశారు. విద్యా శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేకుండా తరగతులు నిర్వహించడంతో ఠాగూర్, లయోలా, కాకతీయ పాఠశాలలకు నోటీసులు జారీ చేసినట్లు ఇన్‌చార్జి ఎంఈఓ తెలిపారు. నోటీసులు తీసుకున్న పాఠశాల యజమానులు వివరణ ఇవ్వాలని కోరారు. నిబంధనలు ఉల్లంఘించిన పాఠశాలలపై తగు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారికి నివేదిస్తున్నట్లు ఇన్‌చార్జి ఎంఈఓ పేర్కొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి




కేటీదొడ్డి: మొక్కలతోనే మానవుడికి జీవనాధారమని ఎస్ఐ శ్రీనివాస్‌రావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా ఎస్ఐ సిబ్బందితో కలిసి 100 మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు మొక్కలు నాటి ప్రగతికి మెట్లు వేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు ఉన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం



గట్టు: బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలెవరు అధైర్య పడొద్దని, వారికి అండగా ఉంటామని బీఆర్ఎస్ నేత, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు బల్గెర హనుమంతు తెలిపారు. ఆదివారం బల్గెరలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలోనే గద్వాలకు బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రానున్నట్లు తెలిపారు. కేటీఆర్ గద్వాల సభకు పెద్ద ఎత్తున కార్యకర్తలు, నాయకులు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు అంగడి బస్వరాజు, వెంకటేష్, రాజు నాయుడు, మద్ది లేటి, నాగరాజు, గట్టన్న, వీరేష్, కంగారు తిమ్మప్ప, లక్ష్మన్న, లోకేష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎస్‌జీటీలను రిలీవ్ చేయాలి



గద్వాల న్యూటౌన్: 2024 బదిలీ అయిన సెకండ్‌గ్రేడ్ టీచర్లను రిలీవ్ చేయాని తెలంగాణ టీచర్స్ యూనియన్ (టీటీయూ) జిల్లా అధ్యక్షుడు బుచ్చన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బదిలీల్లో కొత్త స్థానాలు పొందినప్పటికీ ఇప్పటి వరకు సగం మంది ఉపాధ్యాయులకు ఎల్‌పీసీ ఇవ్వకుండా, రిలీవ్ చేయడం లేదన్నారు. బదిలీ అయిన ఆనందం లేకుండా పోయిందన్నారు. తక్షణమే బదిలీ అయిన ఉపాధ్యాయులను రిలీవ్ చేయాలన్నారు. సిబ్బంది కోసం అవసరమైనచోట వలంటీర్లను నియమించాలని చెప్పారు. సమావేశంలో టీటీయూ రాష్ట్ర కార్యవర్గసభ్యులు కొండాపురం ప్రతాప్, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

యువకుడి హఠాన్మరణం


గోకారి (ఫైల్)

రాజోళి: మండలంలోని మాన్‌దొడ్డికి చెందిన యువకుడు గోకారి(32) ఆదివారం హఠాన్మరణం చెందాడు. గ్రామస్తుల వివరాల ప్రకారం.. మాన్‌దొడ్డి గ్రామానికి చెందిన గోకారి డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం కడుపు నొప్పి వస్తుందని చెప్పడంతో కుటుంబ సభ్యులు ప్రైవేట్ వాహనంలో కర్నూల్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. గోకారికి భార్య, కూతురు, మూడు నెలల బాబు ఉన్నారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

విద్యార్థులకు ప్రయాణ కష్టాలు

- సమయానికి రాని బస్సులు.. తప్పుతున్న క్లాసులు
- విద్యార్థులు ఇంటికెళ్లడానికి చీకటవుతోంది..
- సమయానికి చేరుకోలేని 'పది' విద్యార్థులు
- ఆటోలు, ట్రాక్టర్లలో ప్రమాదకర ప్రయాణం



పచ్చర్ల నుంచి మాన్‌దొడ్డికి ప్రైవేట్ వాహనాల్లో ప్రయాణం చేస్తున్న విద్యార్థులు

రాజోళి: విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు అన్ని రకాల వసతులు కల్పిస్తున్నామని, కార్పొరేట్ తరహాలో చదువును అందిస్తున్నామని, అన్ని రకాల సౌకర్యాలు అందిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం ఒక గ్రామం నుంచి మరొక గ్రామానికి చదువుకునేందుకు వెళ్లే విద్యార్థుల విషయంలో అలసత్వం ప్రదర్శిస్తోంది. చాలా గ్రామాల్లో పదో తరగతి వరకు లేకపోవడంతో ఇతర గ్రామాలకు చదువుకునేందుకు వెళ్లాల్సి వస్తోంది. ఆ గ్రామాలు 5కి.మీ. లపైనే దూరం ఉండటంతో విద్యార్థులు వెళ్లడానికి బస్సు సర్వీసులు తప్పనిసరి. కానీ కేటాయించిన బస్సులు రాకపోవడం, మరికొన్ని గ్రామాలకు బస్సు సౌకర్యమే లేకపోవడంతో విద్యార్థులు బడికి వెళ్లడానికి పడే ఇబ్బందులు తీవ్రంగా ఉన్నాయి. దీనిపై గ్రామస్తులు ఉన్నతాధికారులకు, ఆర్టీసీ అధికారులకు విన్నవించినప్పటికీ ప్రయోజనం లేకుండా పోతుందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాఠశాలకు వెళ్లాలంటే అవస్థలే..

మండల కేంద్రంతో పాటు, మాన్‌దొడ్డి, పెద్దతాండ్రపాడు గ్రామాల్లో జిల్లా పరిషత్ పాఠశాలున్నాయి. ఈ పాఠశాలల్లో పదో తరగతి వరకు ఉంది. మిగతా గ్రామాల విద్యార్థులు ఆ పాఠశాలలకు వెళ్తున్నారు. తుమ్మలపల్లె, తూర్పుగార్లపాడు, పడమటి గార్లపాడు, కొత్త రాజోళి విద్యార్థులు రాజోళిలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్లాలి. తూర్పుగార్లపాడు నుంచి రాజోళికి వెళ్లేందుకు మూడు కి.మీ.లు పైనే నడవాలి. బస్సు సౌకర్యం లేకపోవడంతో కొందరు సైకిళ్లపై, మరి కొందరు నడచుకుంటూ వెళ్తున్నారు. ఇక తుమ్మిళ్ల, అశోక్‌నగర్, ముండ్లదిన్నె గ్రామాల విద్యార్థులు పెద్ద తాండ్రపాడులోని పాఠశాలకు వెళ్తున్నారు. ముండ్లదిన్నెకు 2 కి.మీ. దూరంలో ఉన్నప్పటికీ, తుమ్మిళ్లకు 5 కి.మీ. దూరంలో ఉన్న పెద్ద తాండ్రపాడుకు నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. మాన్‌దొడ్డి పాఠశాలలో చదివేందుకు వెళ్తున్న పచ్చర్ల, నసనూరు, చిన్నధన్వాడ గ్రామాల విద్యార్థుల కష్టాలు వర్ణనాతీతం. ఉదయం నుంచే రోడ్లపై నిల్చొని ప్రైవేట్ వాహనాలపై వెళ్తుంటారు. ఉదయం 9.30 గంటలకు పచ్చర్లలో ఉండాల్సిన బస్సు 10.30 గంటలు దాటినా రాకపోవడంతో విద్యార్థులు కాలినడకతో బడిబాట పడుతున్నారు. 4 కి.మీ దూరం ఉన్న పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థులు నానా తంటాలు పడుతున్నారు. సాయంత్రం సమయంలో 5.00 గంటలకు రావాల్సిన బస్సు చీకటి పడ్డాకా వస్తోంది. పదో తరగతి విద్యార్థులు ప్రత్యేక తరగతులు తప్పడంతో సిలబస్‌లో వెనకబడుతున్నామని ఆందోళన చెందుతున్నారు.

ఆటోలు, ట్రాక్టర్లపై బడికి..

విద్యార్థులకు సమయానికి బస్సు రాకపోవడంతో ప్రైవేట్ వాహనాలపై ప్రయాణం చేస్తున్నారు. ఆటోలు, ట్రాక్టర్లపై బడికి వెళ్తున్నారు. రాత్రి పాఠశాల ముగిశాక ఇంటికి వచ్చేటప్పుడు చీకటి పడుతోంది. వాహనాలు రాకపోవడవంతో నడుచుకుంటూ వెళ్లాల్సి వస్తోంది. పిల్లలు ఇంటికి వచ్చేదాకా భయంతో తల్లిదండ్రులు ఎదురు చూస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కురుస్తున్న వర్షాల కారణంగా రాకపోకలకు మరింత ఇబ్బందిగా మారింది. తమ విద్యార్థుల కష్టాలపై ఆయా గ్రామాల ప్రజలు విద్యాధికారులు, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రం అందచేసినా ఎలాంటి ప్రయోజనం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యార్థుల కష్టాలు తీర్చే విధంగా సరైన సమయానికి బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కరోనా సమయంలో బస్సు రద్దు



గతంలో ముండ్లదిన్నె, పెద్ద తాండ్రపాడు, అశోక్‌నగర్ క్యాంపులను కలుపుతూ తుమ్మిళ్ల వరకు బస్సు సౌకర్యం ఉండేది. ఈ బస్సులో విద్యార్థులు బడికి వెళ్లేవారు. కరోనా సమయంలో బస్సును రద్దు చేశారు. మళ్లీ సౌకర్యం కల్పించాలని, అధికారులకు విన్నవించినా, బస్సు సౌకర్యం కల్పించలేదు.

– గజేంద్ర, తుమ్మిళ్ల

క్లాసులు మిస్సవుతున్నాం..



పదో తరగతి విద్యార్థుల కోసం ఉపాధ్యాయులు నిర్వహించే ప్రత్యేక తరగతులకు హాజరు కాలేకపోతున్నాం. సాధారణ తరగతులను మిస్సవుతున్నాం. దీంతో సిలబస్‌లో వెనకబడుతున్నామనే ఆందోళన మొదలైంది. ముందు నుంచే తరగతులకు హాజరైతే బాగుంటుంది. లేదంటే మార్కులు తక్కువగా వస్తాయనే భయం వెంటాడుతోంది. ఇంటికి రావడానికి రాత్రి అవుతోంది. నడిచి రావాలంటే ఇబ్బందికరంగా ఉంది.

– ప్రవీణ్, విద్యార్థి, పచ్చర్ల

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి


మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్


మాట్లాడుతున్న రామచంద్రారెడ్డి

ఎర్రవల్లిచౌరస్తా: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి రాజగోపాల్ అన్నారు. ఆదివారం ఎర్రవల్లి మండలంలోని కోదండాపురంలో బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో మండల కార్యవర్గ సమావేశం ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందన్నారు. ప్రతి కార్యకర్త గ్రామాల్లో పర్యటించి పలు అంశాలపై ప్రజలకు వివరిస్తూ పోరాటం చేయాలన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులు పోటీ చేసి అత్యధిక మెజారిటీతో గెలిచేలా పోరాడాలని ఆయన సూచించారు. అనంతరం వాల్మీకి మహర్షి విగ్రహానికి పూల మాలలు వేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కేకే రెడ్డి, నాయకులు రామకృష్ణ, మహేంద్రనాయుడు, గోవర్ధన్, నరేష్, మహేష్, నవీన్, హరి, పరశురాం, నర్సింహ, తదితరులు ఉన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుగొమ్మలు

అయిజ: భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే పట్టుగొమ్మలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు మాట్లాడారు. దేశంలో బీజేపీకి మంచి ఆదరణ ఉందని, నరేంద్రమోదీ ముచ్చటగా మూడోసారి ప్రధాన మంత్రి అయ్యారని కొనియాడారు. కేంద్రం నుంచి గ్రామ పంచాయతీలకు నేరుగా నిధులు వస్తున్నాయన్నారు. గ్రామాల్లో, పట్టణాల్లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించాలని, గ్రామాల మధ్య బీటీ రోడ్లు, వంతెనలు నిర్మించాలని, మౌలిక వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు పెద్ద ఎత్తున చేపట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వెంకటేష్, ఆంజనేయులు, ప్రదీప్ కుమార్, భగత్ రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, రఘు, మహేష్, రాజశేఖర్, నరసింహులు, మల్లేష్, నరసప్ప తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ మేనేజర్‌కు వీడ్కోలు


మేనేజర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ కమిషనర్, సిబ్బంది

శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపల్ మేనేజర్ ఎండీ అబ్దుల్ సలాంకు సిబ్బంది ఆదివారం వీడ్కోలు పలికారు. కొంతకాలంగా మేనేజర్‌గా విధులు నిర్వహిస్తున్న అబ్దుల్‌సలాం సాధారణ బదిలీల్లో భాగంగా నాగర్‌కర్నూల్ మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. బదిలీపై వెళ్తున్న మేనేజర్‌ను మున్సిపల్ కమిషనర్ లక్ష్మారెడ్డి, సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.

జోరుగా వరినాట్లు


ఎద్దుల గడెంతో కరిగెట చేస్తున్న రైతు


మన్నాపురం శివారులో వరినాట్లు వేస్తున్న కూలీలు

ధరూరు: ఖరీఫ్ వరినాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. నాలుగైదు రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలు నాట్లకు అనుకూలంగా మారాయి. కరిగెట పనులు చేసుకునేందుకు ముసురు వర్షాలు ఎంతగానో ఉపయోగపడ్డాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని నెట్టెంపాడు ఎత్తిపోతల పథకం కింద వందలాది ఎకరాల్లో వరి నాట్లు జోరుగా సాగుతున్నాయి. కూలీలు సైతం హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెలాఖరు వరకు వరి నాట్లు వేసుకునే అవకాశం ఉంది. పంట పొలాల్లో ఎటు చూసినా రైతులు, రైతు కూలీలే దర్శనమిస్తున్నారు.

వాన ముసురులోనూ ఆగని పని..



రెక్కాడితే గాని డొక్కాడని పరిస్థితి దినసరి కూలీలది. ముసురు వర్షం కూలీలకు పని దొరకకుండా చేస్తోంది. ముసురు వర్షం కారణంగా కూలీలకు పనులు లభించక ఇబ్బంది పడుతుండగా, మరో వైపు దోసకాయను సాగు చేస్తున్న రైతులకు ముసురు వర్షం ఇబ్బందులను కలుగజేస్తోంది. రోజు విడిచి రోజు దోసకాయను తెంపకపోతే అవి విక్రయానికి పనికి రాకుండా పోవడంతో పాటుగా మరి కొన్ని ముదిగి పోతున్నాయి. దీంతో దోసకాయ సాగు చేస్తున్న రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ తరుణంలో కూలీలు వర్షానికి తడువకుండా ప్లాస్టిక్ కవర్లను కప్పుకుని కూలీ పనులు చేస్తున్నారు.

– గట్టు

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

- గురుపౌర్ణమి సందర్భంగా భక్తులతో కిక్కిరిసిన సాయిబాబా ఆలయాలు
- పదో బెటాలియన్‌లో పాల్గొన్న అసిస్టెంట్ కమాండెంట్


బీచుపల్లి పదో పటాలం సాయిబాబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


భైరాపురంలో నారాయణ స్వామికి అలంకరించిన అర్చకులు

ఎర్రవల్లిచౌరస్తా: గురుపౌర్ణమిని పురస్కరించుకొని ఎర్రవల్లి మండల కేంద్రంలోని బీచుపల్లి పదో బెటాలియన్ సాయిబాబా ఆలయం ఆదివారం భక్తులతో కిక్కిరిసింది. ఈ సందర్భంగా ఆలయం చుట్టు పక్క ల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హా జరై సాయిబాబా ఆలయాన్ని దర్శించుకున్నారు. అ నంతరం ధ్వజ స్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజలు చేశారు. పదో పటాలం అ సిస్టెంట్ కమాండెంట్ కాళిదాసు కుటుంబ సభ్యులతో సాయిబాబా ఆలయాన్ని దర్శించుకొని ప్రత్యే క పూజలు చేశారు. అనంతరం ఆలయానికి వచ్చిన భక్తులకు పటాలం ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పా టు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు, ఆర్ఐలు రాజారావు, వెంకటేశ్వర్లు, ఆర్‌పీ సింగ్ ఉన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రం, భైరాపురం, ప్రాగటూరు గ్రామాల్లోని ఆలయాల్లో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో సాయిబాబాకు పంచామృతాభిషేకం నిర్వహించి, మంగళహారతి ఇచ్చారు. భైరాపురంలో భగవాన్ నారాయణ స్వామికి ప్రత్యేక పూజలు చేసి, పుష్పాలంకరణ చేశారు. ప్రాగటూరులో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి, ఆషాఢమాసంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మణి కంఠ అయ్యప్పస్వామి ఆలయ ధర్మకర్త దామోదర్ రెడ్డి, ఆంజనేయ శర్మ, భక్తులు పాల్గొన్నారు.

శాంతినగర్: మండలంలోని ఆయా గ్రామాల్లో భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. పట్టణ పరిధిలోని జమ్ములమడుగు కాలనీలో గురు దత్తాత్రేయ ఆలయం, ఆర్డీఎస్ కెనాల్ సమీపంలో వెలసిన సాయిబాబా మందిరం, ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలో గోవుకు పశుగ్రాసం అందజేసి పూజలు చేశారు. పైపాడు గ్రామంలో వెలసిన మహర్షి వాల్మీకి విగ్రహానికి బీజేపీ నాయకులు పూలమాలలు వేసి పూజలు చేశారు.

అయిజ: మండల కేంద్రంలోని అయ్యప్పస్వామి ఆలయంలోని సాయిబాబా మందిరంలో గురుపూర్ణిమ సందర్భంగా సాయిబాబా విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకొని, ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ వారు భక్తులకు తీర్థ ప్రసాదాలతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రామచంద్రారెడ్డి ఆధ్యాత్మిక, సాంస్కృత, వేద పాఠశాలల్లో గురువులుగా ఉన్న వారిలో కొంతమందికి శాలువాలు కప్పి సత్కరించారు.

రాజోళి: గురుపౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు నిర్వహించారు. వ్రతాలతో పాటుగా ఆలయంలో విశేష పూజలు చేశారు. మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అయిజలో సాయిబాబ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న భక్తులు


ఉండవెల్లిలో సాయిబాబాకు పూజలు చేస్తున్న భక్తులు

రైతుబీమా కోసం దరఖాస్తుల ఆహ్వానం

ధరూరు: పట్టాదారు పాస్ పుస్తకం ఉండి ధరణి పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుని పట్టా పొందిన ప్రతి రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారిణి శ్రీలత ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే నెల 5వ తేదీలోపు సంబంధిత ఏఈఓలకు అందజేయాలని ఆమె కోరారు.

మానవపాడు: మండలంలోని ఆయా గ్రామాల ప్రజలకు రైతుబీమాకు దరఖాస్తులు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ విస్తరణ అధికారులను, మండల వ్యవసాయ అధికారిని కలిసి దరఖాస్తు ఇవ్వాలని సూచించారు.

మల్దకల్: మండలంలోని రైతులు వచ్చే నెల 5లోపు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్య వసాయాధికారి రాజశేఖర్ తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

గట్టు: రైతుబీమా కోసం రైతులు దరఖాస్తు చేసుకోవాలని వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి, వ్యవసాయ విస్తర్ణ అధికారి తిరుమలేషలు ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్లలోపు, 18 ఏళ్లు పైబడిన రైతులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని తెలిపా రు. ఆగస్టు 5వ తేదీ లోపు బీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అయిజ: రైతులు రైతుబీమా కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఒక ప్రకటనలో కోరారు. దరఖాస్తు చేసుకోవడానికి దరఖాస్తు ఫాంతో పాటు పట్టా పాస్‌బుక్, ఆధార్, నామినీ, ఆధార్ జిరాక్స్ కాపీలు అవసరమని తెలిపారు. మండలంలోని అన్ని రైతువేదికల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

బస్టాండ్ బురదమయం!




గట్టు: ముసురు వర్షానికి మండల కేంద్రంలోని బస్టాండ్ మొత్తం బురద మయంగా మారింది. వాహనాల రాక పోకల సందర్భంగా బస్టాండ్ ఆవరణలో కాలు కింద పెట్టలేని పరిస్థితి. గట్టు నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లాలన్నా, ఇతర ప్రాంతాల నుంచి గట్టు వచ్చి బస్టాండ్‌లో కాలు నేలపై పెట్టడానికి ఇబ్బంది పడే పరిస్థితి తలెత్తింది. తారు రోడ్డును మట్టితో కప్పి వేయగా, వర్షానికి వాహన రాకపోకల కారణంగా బస్టాండ్ బురదమయంగా మారింది. గట్టుకు చెందిన కొందరు యువకుల్లో బురమయంగా మారిన గట్టు బస్టాండ్ దుస్థితిపై వీడియోను తీసి సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. దీనికి రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమంటూ వీడియో తీసి పెడుతున్నారు. అధికారులు మాత్రం స్పందించడం లేదు.

రక్తదాతలకు సన్మానం

రాజోళి: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడుతున్న దాతలకు చిరంజీవి ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యులు జంగం శివరామయ్య, హుస్సేన్‌ల ఆధ్వర్యంలో ఆదివారం సన్మానం చేశా రు. మండల కేంద్రంలో నిర్వహించిన సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. అత్యవసర సమయంలో రక్తదానం చేసి ప్రాణాలు నిలుపుతున్న వారు వైద్యులతో సమానమన్నారు. ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిని ప్రత్యేకంగా గుర్తించి వారికి పూల మాలలు, శాలువాలతో సన్మానం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ కో ఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్, జై శ్రీరామ్‌సేవా సమితి సభ్యులు మహేష, చేనేత గ్రామిక సేవా సమితి సభ్యులు వీరేష్, రాజశేఖర్, అంజి, శాంతయ్య, వెంకటేష్, మంజునాథ్ పాల్గొన్నారు.


రక్తదానం చేసిన దాతలు

వానరానికి అంత్యక్రియలు


వానరాని అంత్యక్రియలకు తీసుకెళ్తున్న గ్రామస్తులు

వీపనగండ్ల: మండలంలోని గోవర్ధనగిరిలో ఆదివారం వీధికుక్కల దాడికి గురై మృతిచెందిన వానరానికి గ్రామస్తులు సంప్రదాయబద్ధంగా అంత్యక్రియలు నిర్వహించారు. వానరుడు సాక్షత్తు ఆంజనేయస్వామి స్వరూపమని భావించిన గ్రామస్తులు మృతిచెందిన వానరాన్ని గ్రామంలో ఊరేగింపు నిర్వహించి శివారులో ఖననం చేశారు. గ్రామంలోని వీధి కుక్కల నివారణకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సోమనాథ్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, దర్గేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.